క్లుప్తంగా

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అర్బన్ హెల్త్ ట్రెనింగ్ సెంటర్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్‌వర్ధన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని శ్రీహరిరావు నగర్ కాలనీలో అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఆర్.ప్రసన్నలత, వైద్యులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దసరాకు డీఏ ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు దసరా పండుగకు కరువుభత్యంను ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగష్టు నెలలో జరిగిన ఉద్యోగుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు జులై 2022కు సంబంధించిన డీఏను దసరా పండుగకు చెల్లిస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి, గురయ్య పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులను వేధించడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని తెలుగుదేశం పార్టీ జిల్లా సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి అన్నారు. సీపీఎస్, జీపీఎస్ విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ జిల్లాశాఖ కడపలోని యూటీఎఫ్ భవన్‌లో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు శుక్రవారం రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తమ మద్దతు ప్రకటించాయి. దీక్షలకు సంఘీభావంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, జేవీవీ రాష్ట్ర ట్రెజరర్ రాజశేఖర్ రాహుల్, రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం మాట్లాడారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవకుమార్, ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, సహాధ్యక్షులు రవికుమార్, సీపీఎస్ జిల్లా కన్వీనర్ సుదర్శన్ దీక్షలో కొనసాగుతున్నారు.

రైతులకు రుణాలివ్వాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, ష్యూరిటీ లేని రుణాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం లీడ్ బ్యాంకు మేనేజర్ దుర్గాప్రసాద్‌కు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రూ. 1.60 లక్షల వరకు రుణ పత్రాలు అవసరం లేకుండా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కట్టా యానాదయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బాల చంద్రయ్య, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నిబద్ధతగల ఉద్యోగి చంద్రకిశోర్



మాట్లాడుతున్న వైవీయూ వీసీ

కడప కల్చరల్ : బ్రౌన్ గ్రంథాలయ ఉద్యోగి పసుపులేటి చంద్రకిశోర్ నిబద్ధతగల వ్యక్తి అని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం చంద్రకిశోర్ సంస్మరణార్థం 'అక్షర నీరాజనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వీసీ, వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది కలిసి చంద్రకిశోర్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ కిశోర్ సేవలను కొనియాడి ఆయన కుటుంబానికి సహాయం చేస్తానన్నా రు. ఆచార్య మూల, ఆచార్య తప్పెట , బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు షేక్ హుస్సేన్ సత్యాగ్ని, సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, పలువురు సాహితీవేత్తలు, రచయితలు కిశోర్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.



కల్పవృక్ష వాహనంపై కడప రాయుడు



సరస్వతీమాతగా శ్రీలలితాంబిక



సరస్వతీమాతగా బాల పోలేరమ్మ



సరస్వతీమాతగా శ్రీ కన్యకాంబ

సరస్వతీ.. నమస్తుభ్యం



కడప నగరంలోని నడివీధి గంగమ్మ ఆలయంలో ఆకట్టుకున్న సరస్వతీమాత అలంకారం

దసరా ఉత్సవాలలో భాగంగా కడప నగరంలోని దేవీ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం రాత్రి 6 గంటల నుంచి భక్తులు ఆలయాల బాట పట్టారు. సరస్వతీమాత అలంకారం గనుక చదువుకుంటున్న తమ పిల్లలను, తొలిసారిగా బడికి వెళ్లి చదువులు ప్రారంభించాల్సి ఉన్న చిన్నారులను గుడికి తీసుకెళ్లారు. అమ్మవారి సన్నిధిలో అర్చకులు వేదమంత్ర యుక్తంగా సరస్వతీమాతను పూజించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి అమ్మవారి ఆశీస్సులు అందించారు. కడప రాయుడు కల్పవృక్ష వాహనంలో భక్తులను కరుణించారు. శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం, చెన్నై రోడ్డులోని శ్రీ లలితాంబిక ఆలయంలో, పెద్దబెస్తవీధిలోని శ్రీ బాల పోలేరమ్మ ఆలయంలో అమ్మవార్లను వీణాపాణిగా ఉన్న శ్రీ సరస్వతీమాతగా అలంకరించారు. ఇంకా నగరంలోని అన్ని అమ్మవారి ఆలయాలలో ఉత్సవాలు నిర్వహించారు. – కడప కల్చరల్



కాత్యాయినిగా శ్రీ విజయదుర్గాదేవి



సరస్వతీమాతగా కళాంబదేవి



గరుడ వాహనంపై లక్ష్మి సత్యనారాయణుడు



సరస్వతీదేవిగా భువనేశ్వరీమాత

ఆధునికత అందిపుచ్చుకోవాలి



ఫొటో, వీడియోగ్రాఫర్లతో అతిథులు

కడప కల్చరల్ : ఫోటోగ్రఫీ రంగంలో ఆధునికత అందిపుచ్చుకున్నప్పుడే ఆ వృత్తిలో రాణించగలమని ప్రముఖ కెమెరాల కంపెనీ సోని ఫ్యాకల్టీ, ఆల్ఫా స్పెషలిస్టు సతీష్ అన్నారు. శుక్రవారం స్థానిక రాజ్ మయూరా గార్డెనియాలో ఆంధ్రప్రదేశ్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కడప శాఖతో కలిసి ఫోటోగ్రాఫర్లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సతీష్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ గురించి వివరించారు. మరో ఫ్యాకల్టీ, సీపీఆర్‌ఓ స్పెషలిస్టు ముస్తఫా, సోని కంపెనీ ఏఎస్ఎం సాయిరెడ్డి, చైతన్య ఆధునిక కెమెరాలలో దృశ్యాలను సరిచేసుకునే అంశాల గురించి వివరించారు. ఫోటో, వీడియోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు చంద్రారెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు దీవెనలు అందించండి

– ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు తమ చల్లని దీవెనలు అందించి, మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 6 డివిజన్‌లోని కొండాయపల్లె ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

– ఈ సందర్భంగా షేక్ ఖాదర్ బీ అనే మహిళ తనకు జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, పింఛన్ కానుక, సున్నావడ్డీ, ఇంటి స్థలం ద్వారా రూ.10.52 లక్షల లబ్ధి కలిగిందని ఆనందం వ్యక్తం చేసింది. సి. మునిరెడ్డి అనే వ్యక్తి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమకు వివిధ పథకాల ద్వారా రూ.10.05 లక్షల వరకూ మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేశాడు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపారు. అంతకుముందు డిప్యూటీ సీఎం కొత్తగా టిడ్కో ఇళ్లు మంజూరైన వారికి ఇంటి పట్టాలు అందజేశారు. డిసెంబర్‌లో వారికి ఇళ్లు అప్పగిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 6వ డివిజన్ కార్పొరేటర్ నాగేంద్రప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, బండి ప్రసాద్, తోటక్రిష్ణ, గోపాలక్రిష్ణ, అర్జున్, మునిశేఖర్‌రెడ్డి, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, రామలక్షుమ్మ, తులశమ్మ, నారాయణమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

రాఘవేంద్ర మోటార్స్ షోరూం ప్రారంభం



కొనుగోలుదారుడికి ట్రాక్టర్ తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

కడప కల్చరల్: ప్రొద్దుటూరు ఆటోనగర్‌లో శుక్రవారం శ్రీ రాఘవేంద్ర మోటార్స్ ఫర్గూసన్ ట్రాక్టర్ షోరూంను మైదుకూరు, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేలు శెట్టిపల్లె రఘురామిరెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా టఫే కంపెనీ డీలర్, డెవలప్‌మెంట్ నేషనల్ హెడ్‌నయీం, కల్మేకర్, జోనల్ మేనేజర్ సౌమిత్రి, శ్రీవాత్సవ, ఆర్ ఎం శ్రీకాంత్, సుమంత్‌ధర్మలు కంపెనీ ప్రతినిధులుగా హాజరయ్యారు. షోరూం ప్రతినిధులు బొర్రా సాంబశివారెడ్డి, రాఘవరెడ్డి, సుబ్బారెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మూలే సుధాకర్‌రెడ్డి, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులకు 33 ట్రాక్టర్లను అందజేశారు. ఎమ్మెల్యేలు వారికి ట్రాక్టర్ తాళాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

చిరస్మరణీయుడు 'బ్రౌన్ శాస్త్రి'



డాక్టర్ జానమద్ది చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి చిరస్మరణీయుడని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి కొనియాడారు. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి జయంతి సందర్భంగా కడప నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా లేని విధంగా బ్రౌన్ స్మారక గ్రంథాలయ నిర్మాణం, అభివృద్ధి కోసం చివరి శ్వాస వరకు డాక్టర్ జానమద్ది పరితపించారన్నారు. అందుకే ఆయనను సాహితీ ప్రియులు బ్రౌన్ శాస్త్రిగా పేర్కొంటారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ విజయభాస్కర్, ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీరు ఉమామహేశ్వర్‌రెడ్డి, క్లబ్ కోశాధికారి జీవీ భద్రయ్య, సభ్యులు లేవాకు మధుసూదన్‌రెడ్డి, బాల యల్లారెడ్డి, మానవత సుబ్బరాయుడు, కొండూరు జనార్దన్‌రాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి



మ్యాపులను పరిశీలిస్తున్న నగర పాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగర శివార్లలో నూతనంగా నిర్మిస్తున్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ) పనులను త్వరగా పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన ఎస్‌టీపీతోపాటు బండి కనుమ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బ్లోయర్ రూమ్, కలెక్షన్ వాల్ పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు. ఎస్‌టీపీకి పైపులైన్ పనులు కూడా పూర్తి చేయాలన్నారు. బండి కనుమ నుంచి కడప నగర ప్రజలకు తాగునీటి సరఫరా సకాలంలో జరిగేలా ప్రణాళికలు చేయాలన్నారు. స్కావెంజర్స్ కాలనీ వాటర్ ట్యాంకు నుంచి ప్రజలకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాత కడప ఈఎల్ఎస్ఆర్ నుంచి కొత్త డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలన్నారు. యునాని వాటర్ ట్యాంకు పనులను త్వరగా పూర్తి చేసి డిస్ట్రిబ్యూషన్ వాటర్ పైపులైన్‌కు ఇంటర్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

సర్కిల్‌లో క్రైస్తవ చిహ్నానికి చోటివ్వండి

కడప కల్చరల్ : నగరంలోని క్యాథడ్రల్ చర్చి సర్కిల్‌లో చర్చి నమూనాను ఏర్పాటు చేయాలని మరియాపురం చర్చి కమిటీ సభ్యులు వారాధి జోసెఫ్, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ నగర పాలక సంస్థ కమిషనర్ నగరాన్ని సుందరీకరించడంలో భాగంగా మాసాపేట సర్కిల్‌లో దేవాలయం, అల్మాస్‌పేట సర్కిల్‌లో దర్గా చిహ్నలను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దాంతోపాటు కడప నగర అభివృద్ధికి ఎంతో కృషి చేసిన క్రైస్తవులు ఎందరో ఉన్నారని, వారి జ్ఞాపకార్థం క్యాథడ్రల్ చర్చి లాంటి గొప్ప ప్రార్థనాలయం చిహ్నాన్ని ఆ సర్కిల్‌లో ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి జార్జి, అల్లూరి జోజప్పలు తదితరులు పాల్గొన్నారు.

నేడే ప్రత్యేక లోక్ అదాలత్

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో మోటార్ వాహనాల ప్రమాదాలకు సంబంధించిన కేసులు (ఎం.వి.ఓ.పి), రెవెన్యూ కేసులు మాత్రమే రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. వివరాల కోసం 08562- 258622, 244622 లలో సంప్రదించాలని జడ్జిలు కోరుతున్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కాశినాయన మండలం అక్కెంగుండ్ల భూ కబ్జాదారులకు సహకరిస్తున్న ఎస్ఐని సస్పెండ్ చేయాలని భూ పోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేషలు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడారు.